


ఇంగ్లిష్ పరీక్షకు 140 మంది విద్యార్థుల గైర్హాజరు

వికారాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షకు 83.39 శాతం విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష కొనసాగుతోంది. కాగా ఇంగ్లిష్ ఎగ్జామ్ 798 మంది రాయాల్సి ఉండగా, 658 మంది పరీక్షకు హాజరయ్యారు. 140 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తికర ఫలితాలు వెలువడ్డాయి. చేవెళ్ల పార్లమెంటు నుంచి పోటీ చేసిన మొత్తం 43 మంది అభ్యర్థుల్లో ఇద్దరికే డిపాజిట్లు దక్కాయి. మిగిలిన 41 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఇందులో ప్రధాన పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థితో పాటు 21 మంది స్వతంత్ర అభ్యర్థులు, చిన్నా చితక పార్టీలకు సంబంధించి మరో 20 మంది అభ్యర్థులు ఉన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో 29,39,057 ఓటర్లున్నారు.



- చేవెళ్ల బరిలో 43 మంది పోటీ.. 41మంది అభ్యర్థులకు దక్కని డిపాజిట్
- మల్కాజిగిరిలో 22 మంది పోటీ.. 20 మందికి ధరావత్ గల్లంతు
- బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు 'కాసాని', రాగిడి లక్ష్మారెడ్డితో పాటు డిపాజిట్ కోల్పోయిన తెలుగు నటి దాసరి సాహితి
- పరాభవంలో 41 మంది స్వతంత్రులు, 20 మంది వివిధ పార్టీల అభ్యర్థులు



అయ్యయ్యో!

ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

చేవెళ్ల నియోజకవర్గం



అభ్యర్థి : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ)
వచ్చిన ఓట్లు: 8,09,882
శాతం: 48.34
మెజారిటీ: 1,72,897

మల్కాజిగిరి నియోజకవర్గం



అభ్యర్థి : ఈటల రాజేందర్ (బీజేపీ)
వచ్చిన ఓట్లు: 9,91,042
శాతం: 49.30
మెజారిటీ: 3,91,475

చేవెళ్ల నియోజకవర్గం



అభ్యర్థి : డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు: 6,36,985
శాతం: 38.02

మల్కాజిగిరి నియోజకవర్గం



అభ్యర్థి : సునీతా మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు: 5,99,567
శాతం: 29.83

చేవెళ్ల నియోజకవర్గం



అభ్యర్థి : కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్ఎస్)
వచ్చిన ఓట్లు: 1,78,968
శాతం: 10.68

మల్కాజిగిరి నియోజకవర్గం



అభ్యర్థి : రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్ఎస్)
వచ్చిన ఓట్లు: 3,00486
శాతం: 14.95

మల్కాజిగిరిలో డిపాజిట్ కోల్పోయిన అభ్యర్థులు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
అనితారెడ్డి శీలం	బీఎస్పీ	4,779
రాగిడి లక్ష్మారెడ్డి	బీఆర్ఎస్	3,00,486
అప్పారావు కొండ	ఆర్ఎస్‌పీపీ	1,162
చామకూర రాజయ్య	ఎస్‌జేపీఐ	723
జువ్వ ఫణికుమార్‌చౌదరి	జేబీఎన్‌పీ	508
నర్ర సుఖేందర్‌రెడ్డి	వీఆర్‌పీ	694
పెద్దపల్లి సందీప్	బీవైడీ	933
మోయిన దుర్గప్రసాద్‌యాదవ్	డీఎస్పీ	789
యాదీశ్వర్ నక్క	టీపీపీ	494
కంటె సాయన్న	ఇండిపెండెంట్	539
చిలిపి రెడ్డి రమేష్	ఇండిపెండెంట్	987
తల్లాడ వెంకటేశ్వర్లు	ఇండిపెండెంట్	6,800
దొంతుల భిక్షపతి	ఇండిపెండెంట్	1,821
పెసరికాయల పరీక్షిత్‌రెడ్డి	ఇండిపెండెంట్	1,835
బంజపల్లి సుధారాణి	ఇండిపెండెంట్	1,069
భరత్ సుదర్శన్	ఇండిపెండెంట్	1,643
మోతం సంపత్	ఇండిపెండెంట్	1,137
రాజేష్ మిశ్రా	ఇండిపెండెంట్	11,110
వైష్ణవి ప్రసాద్	ఇండిపెండెంట్	1,912
ఆర్.సుబేందర్ సింగ్	ఇండిపెండెంట్	467

లోక్‌సభ ఎన్నికల్లో పలువురికి డిపాజిట్లు గల్లంతు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/మేడ్చల్, జూన్ 6) : లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తికర ఫలితాలు వెలువడ్డాయి. చేవెళ్ల పార్లమెంటు నుంచి పోటీ చేసిన మొత్తం 43 మంది అభ్యర్థుల్లో ఇద్దరిని మాత్రమే ప్రజలు ఆమోదించారు. మిగిలిన 41 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఇందులో ప్రధాన పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థితో పాటు 21 మంది స్వతంత్ర అభ్యర్థులు, చిన్నాచితక పార్టీలకు సంబంధించి మరో 20 మంది అభ్యర్థులు ఉన్నారు. చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలో చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్ర నగర్, శేరిలింగంపల్లి, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 29,39,057 ఓటర్లు ఉన్నారు. మేనెల 13వ తేదీనా ఎన్నికలు జరిగాయి. జూన్ 4వ తేదీన చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగింది. 24 రౌండ్లలో జరిగిన ఈ లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి చివరి వరకు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధిక్యతను చాటారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఘోర పరాభవం ఎదురైంది. ఈయనకు డిపాజిట్ కూడా రాలేదు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తమ డిపాజిట్‌ను కాపాడుకునేందుకు మొత్తం ఓట్లలో 1/6 ఓట్లు పొందాలి. పోలైన ఓట్లలో ఆరో వంతు (16.66) ఓట్లు పొందాల్సి ఉంటుంది. స్వతంత్ర అభ్యర్థులు, చిన్న చితక పార్టీల్లు గల్లంతయ్యాయి. 21 మంది అభ్యర్థులకు కేవలం వేయి లోపు ఓట్లు రావడం గమనార్హం.

మల్కాజిగిరిలో ...

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల్లో మొత్తం 22 మంది అభ్యర్థుల్లో ఇద్దరిని మాత్రమే ప్రజలు ఆమోదించారు. మిగిలిన 20 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఇందులో ప్రధాన పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థితో పాటు 19 మంది స్వతంత్ర అభ్యర్థులు, చిన్న చితక పార్టీలకు చెందినవారున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 39,79,596 ఓటర్లు ఉన్నారు. జూన్ 4వ తేదీన కీసరలోని హోలీ మేరీ ఇంజనీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగింది. 21 రౌండ్లలో జరిగిన ఈ లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి చివరి వరకు బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఆధిక్యతను చాటారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికు ఘోర పరాభవం ఎదురైంది. లక్ష్మారెడ్డికి 3,00,486 ఓట్లు వచ్చాయి. ఈయనకు డిపాజిట్ కూడా రాలేదు.

చేవెళ్లలో డిపాజిట్ కోల్పోయిన అభ్యర్థులు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	ఏఐఎఫ్‌బీఆల్	3,748
పి. గోవింద్	బీఎంపీ	611
చింతలగారి వెంకటస్వామి	బీపీపీ	436
తోట్ల రాఘవేందర్ ముదిరాజ్	డీఎస్పీ	1,648
దుర్గాప్రసాద్ టి	పీపీపీ	1,139
నరసింహారెడ్డి ద్యాప	టీఆర్‌పీ	525
పాలమాకుల మధు	ఐపీబీపీ	430
ఫణి ప్రసాద్ కటకం	ఎస్‌జేపీఐ	1,426
మహ్మద్ అబ్దుల్ ఖావి అబ్బాసి	ఏఐఎమ్ఈఈఈఈఎం	635
మహ్మద్ సలీం	ఆర్‌పీసీ(సెక్యులర్)	2,373
మహ్మద్ షకీల్	డీజేపీ	1,647
బీవీ రమేష్ నాయుడు	ఎస్‌పీ(ఇండియా)	1,495
రాములు బింగి	వైటీపీ	4,284
రంజిత్‌రెడ్డి గాదె	ఆర్ఎస్‌పీ	1,698
శ్రీదేవి ఎం	ఏడీఆర్‌పీ	2,688
సానెం రాజుగౌడ్	పీఏపీ	971
సుగురు శ్రీనివాస్	జేఎస్‌పీ	1,386
సుధాకర్ వనం	ఎంసీపీఐ(యునైటెడ్)	581
సేరుబాయి వసంత్ కుమార్	ఆర్ఎస్‌పీపీ	312
అమీర్ సాజిద్	ఇండిపెండెంట్	228
అంకగాల ప్రవీణ్‌కుమార్	ఇండిపెండెంట్	488
ఆంజనేయులు నీరటి	ఇండిపెండెంట్	449
ఈసరి సూర్యప్రకాశ్‌రెడ్డి	ఇండిపెండెంట్	583
కత్తుల యాదయ్య	ఇండిపెండెంట్	1,155
కావలి సుకుమార్	ఇండిపెండెంట్	397
కండికేకర్ శ్రీనివాస్	ఇండిపెండెంట్	446
గోనె శ్రీనివాస్‌రెడ్డి	ఇండిపెండెంట్	752
గోవింద్‌లాల్	ఇండిపెండెంట్	661
జనపాల దుర్గాప్రసాద్	ఇండిపెండెంట్	1,517
జలీల్ హైమద్	ఇండిపెండెంట్	1,510
వి. పాండు	ఇండిపెండెంట్	1,075
జి. మల్లేశంగౌడ్	ఇండిపెండెంట్	1,240
మహమ్మద్ ఇక్బాల్	ఇండిపెండెంట్	494
మహ్మద్ అఫ్సర్ ఖుద్దూస్	ఇండిపెండెంట్	179
మహ్మద్ అలీ	ఇండిపెండెంట్	248
మహ్మద్ పాషా	ఇండిపెండెంట్	628
మహమ్మద్ ముస్తాఫా రిజ్వాన్	ఇండిపెండెంట్	301
మహ్మద్ రియజుర్ రెహ్మాన్ షేక్	ఇండిపెండెంట్	285
విశ్వకర్మ సప్తగిరి	ఇండిపెండెంట్	489
సాహితి దాసరి	ఇండిపెండెంట్	1,938



డిపాజిట్ కోల్పోయిన తెలుగు నటి దాసరి సాహితి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమాని, నటి దాసరి సాహితి ఎన్నికల బరిలో దిగారు. పొలిమేర, పొలిమేర-2 సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న నటి సాహితీ చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలో పోటీ చేశారు. ఆమెకు 1,938 ఓట్లు మాత్రమే వచ్చాయి. డిపాజిట్ కూడా దక్కలేదు.

పోలింగ్ వివరాలు

పార్లమెంటు	చేవెళ్ల	మల్కాజిగిరి
మొత్తం ఓట్లు	29,39,057	39,79,596
పోలైన ఓట్లు	16,68,931	19,34,065
నోటాకు	6,423	13,366
రిజక్ట్ అయినవి	221	222

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు నాణ్యతగా చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని, నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ గౌతమ్ అన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులను అధికారులు రోజూ పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తిచేసేలా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాం తయారీ తదితరాంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల్లో వసతులు కల్పనలో భాగంగా 286 స్కూల్లలో చేపట్టిన తాగునీరు, మరుగుదొడ్లు, మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి పనులు ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి, ఎన్ని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పనులు చేయాల్సి ఉంది, ఎప్పటిలోగా పూర్తిచేస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యాచరణ రూపొందించుకొని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సూచించారు. పనులను నాణ్యతగా చేయించాల్సిన బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీపై ఉందన్నారు. నిధులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫామ్‌లను పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠశాలలకు చేర్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. యూనిఫాంలు స్వయం సహాయ సంఘాలు కుడుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఎన్ని జతలు సిద్ధం చేశారు? మెటీరియల్ అందుబాటులో ఉందా? అని వివరాలు అడిగారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్‌అగస్త్య, డీఆర్డీవో పీడీ సాంబశివరావు, డీఈవో విజయ కుమారి, మెప్మా అధికారి అనిల్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

పలుచోట్ల మోస్తరు వర్షం

- సాగు పనులు మొదలుపెడుతున్న రైతులు
- ఎండ నుంచి ఉపశమనం పొందుతున్న జనం



మేడ్చల్‌లో కురుస్తున్న వర్షం

ఘట్ కేసర్/కీసర/మేడ్చల్ టౌన్, జూన్ 6 : ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం 5:30గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం కురిసిన వర్షంతో ఐతులు హర్షం వ్యక్తం చేస్తుండగా గురువారం మరోసారి వాన రావడంతో వర్షాకాలం వచ్చేసిందని, ఎండల బాధ తప్పిందని జనం ఉపిరి పీల్చుకున్నారు. కీసరలో వర్షం కురిసింది. కాగా రోహిణి కార్తె మొదట్లో దంచికొట్టిన ఎండలతో జనం సతమతమయ్యారు. మృగశిర కార్తె రాకముందే వర్షాలు కురుస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగు పనుల్లో బీజీ అవుతున్నారు. మేడ్చల్‌లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షానికి జాతీయ రహదారిపై వాహనాలు స్తంభించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాచింది. వర్షంతో వాతావరణం మరింత చల్లబడింది. కాగా కొన్ని కాలనీల్లో గంట పాటు కరెంట్ కట్ అయింది.



కీసరలో రోడ్డుపై పారుతున్న వాన నీరు

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా జాగ్రత్తలు

- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



వికారాబాద్, జూన్ 6 : జిల్లాలో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం గ్రూప్-1 పరీక్ష, వానకాలం సాగు కార్యాచరణ, మిషన్ భగీరథ, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు తదితరాంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాల లభ్యతతో రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రతీ మండలంలో ఇన్‌చార్జి అధికారులను నియమించామన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు జూన్ 10వ తేదీ లోపు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో స్కూల్ డ్రెస్సులు కుట్టేందుకు మహిళా సంఘాలకు ఆర్డర్ ఇచ్చామని, ఇప్పటికే 71,304 జతల డ్రెస్సుల తయారీ పూర్తి అయ్యిందని తెలిపారు. మరో 17శాతం యూనిఫామ్‌ల స్టిచింగ్ రెండు రోజుల్లో పూర్తవుతుందని కలెక్టర్ ఉన్నతాధికారులకు చెప్పారు. కలెక్టర్‌తో పాటు కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, డీఈవో రేణుకాదేవి, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ బాబుశ్రీనివాస్, మెప్మా పీడీ రవి కుమార్ తదితరులు వీసీలో పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి పనులు పూర్తి చేయాలి

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారి నుంచి అటెండర్ వరకు సిబ్బంది అంతా అందుబాటులో ఉండి పరిపాలన పరంగా కార్యాలయంలో పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ. లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అధికారులందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఇక కార్యాలయాల్లో రెగ్యులర్ పనులపై దృష్టిపెట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది అటెండెన్స్ యాప్‌ను ఉపయోగించాలన్నారు. సోమవారం యథావిధిగా ప్రజావాణి ఉంటుందన్నారు.

సదరం క్యాంప్‌నకు స్లాట్ బుక్ చేసుకోవాలి

జిల్లాలో వికలాంగులకు సదరం క్యాంపునకు జూన్ 7న(శుక్రవారం) ఉదయం 11 గంటల నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. స్లాట్‌బుక్ చేసుకున్న దివ్యాంగుల్లో అంగవైకల్యం, బుద్ధిమాంద్యం, చెవిటి, మూగ వారు జూన్ 11, 13, 21, 27, 29 తేదీల్లో తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంపులకు హాజరుకావాలని సూచించారు. అలాగే 10, 11, 18, 26 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించే క్యాంపులకు అంగవైకల్యం, అంధులు హాజరుకావాలని వివరించారు. ఇంతకు ముందు సదరం సర్టిఫికెట్ పొంది కాలం తీరిన వారితో పాటు, కొత్తగా స్లాట్ బుక్‌చేసుకున్న వారూ హాజరు కావాలన్నారు. ప్రస్తుతం 590 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

గ్రూప్ 1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, జూన్ 6: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి గురువారం ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లు, జాయింట్ కస్టోడియన్‌లతో జూన్ 9న నిర్వహించే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు అన్ని వసతులను సిద్ధం చేశామన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్, టాయిలెట్లు, తాగు నీరు ఉండే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణ చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో బయోమెట్రిక్‌పై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర, టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ రాజేష్, అమరేందర్ కృష్ణ ఉన్నారు.

మంత్రివర్గంలో స్థానంపై టీఆర్ఆర్ ఆశలు!

● ఆ దిశగా ముమ్మర ప్రయత్నాలు?
● ఢిల్లీ పెద్దలతో టీఆర్ఆర్‌కు సత్సంబంధాలు
● సీఎంతో సాన్నిహిత్యం కలిసొచ్చే అవకాశం
● ఉమ్మడి జిల్లా నుంచి రామ్మోహన్‌రెడ్డి పేరు ఉంటుందని ప్రచారం


పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 6: సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో స్థానం కోసం పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తోంది. ఇంకా పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణ జరగలేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ముగిశాక మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సీఎం సంకేతాలు ఇచ్చారు. దీంతో ఆశావహుల్లో ఆశలు రేకెత్తాయి. ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం లేదు. సీఎం జిల్లా నుంచే ప్రాతినిథ్యం ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోకి వస్తారు. ఉమ్మడి జిల్లా నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం ఉంటుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. అయితే పరిగి నుంచి ఎమ్మెల్యేగా రెండవసారి ఎన్నికైన డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి మంత్రిపదవిపై ఆశలు పెట్టుకున్నారు. 2006లో పరిగి రాజకీయాల్లోకి అరగేంట్రం చేసిన రామ్మోహన్‌రెడ్డి అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. అప్పట్లో ఇతర పార్టీల నుంచి మంచి అవకాశాలు వచ్చినా పార్టీనే నమ్ముకుని కొనసాగుతూ వచ్చారు. పరిగి నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన టీఆర్ఆర్ రెండు పర్యాయాలు విజయం సాధించిన సంగతి తెలిసిందే. పరిగిలో కాంగ్రెస్ అంటనే రామ్మోహన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి అంటనే కాంగ్రెస్ అన్న విధంగా పార్టీని తన భుజస్కంధాలపై వేసుకుని నడిపించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలన్ని కాంగ్రెస్ గెలుపులో ఆయన కీలక పాత్ర పోషించారు. కొడంగల్ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోకి తీసుకుంటే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఒక మంత్రి పదవి దక్కాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహింపట్నం మల్‌రెడ్డి రంగారెడ్డిలు ఇద్దరూ మంత్రి పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి మధ్యలో పార్టీమారి వచ్చినప్పటికీ, రామ్మోహన్‌రెడ్డి మాత్రం నాటి నుంచి ఒకేపార్టీలో కొనసాగుతున్నారు. పరిగి రామ్మోహన్‌రెడ్డికి సీఎం రేవంత్‌తోపాటు, ఢిల్లీ హైకండ్ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆరు మాసాలుగా కూడా ప్రభుత్వవిధానాలు, పార్టీ వ్యవహారాల్లో విపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వడంతో రామ్మోహన్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే టీఆర్ఆర్ ఢిల్లీ పెద్దలను కలిశారు. ఖర్గే, రాహుల్‌తోపాటు, ఇతరులను కలిసి విన్నవించినట్లు సమాచారం. రాష్ట్ర క్యాబినెట్‌లోకి ఇంకా ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకోవాల్సి ఉంది. ఆరుగురిలో తన పేరు ఉంటుందని రామ్మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. జిల్లా నుంచి రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని పార్టీ శ్రేణులు కూడా కోరుతున్నారు.

నెమలిని కాల్చిన ఘటనాస్థలం పరిశీలన

కులకచర్ల, జూన్ 6: వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం ఈర్లవాగు తండా పంచాయతీ పరిధిలోని పాచావుకుంట తండా సమీపంలో జాతీయ పక్షి నెమలిని కాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనాస్థలాన్ని అధికారులు గురువారం పరిశీలించారు. పరిశీలించారు. బుధవారం పాచావుకుంట తండా సమీపంలో జాతీయ పక్షి నెమలికి విద్యుదాఘాతంతో మృత్యువాతపడిన నెమలిని గమనించిన తండా వాసులు నీల్యానాయక్, గోబ్యానాయక్‌లు నెమలి ఈకలు పీకి అక్కడే కాల్చుకు తిన్నారు. ఇందుకు సంబంధించిన నెమలిని కాల్చిన ఈకలు అక్కడే ఉన్నాయి. ఈ ఘటనపై తండా వాసులు కొందరు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటవీశాఖ సెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, బీట్ అధికారి జమీరోద్దీన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న నెమలి ఈకలను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణ సెక్షన్ కింద ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.


నెమలిని కాల్చిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుగ్గరామేశ్వరంలో నవగ్రహ పాశుపత హోమం

▸ పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూన్ 6: వికారాబాద్‌లోని శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ పాశుపత హోమం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. హోమ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమగుండంలో పూర్ణహోతి సమర్పించి శ్రీ బుగ్గ రామయలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యంసేట్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రరెడ్డి కౌన్సిలర్లు మురళి పాల్గొన్నారు.


పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతుల పూజలు


పూజ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్

పరిగి ఎమ్మెల్యే ఎమ్మెల్యే పూజలు

పరిగి, జూన్ 6: వికారాబాద్‌లోని శ్రీబుగ్గరామేశ్వరస్వామి దేవాలయాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ నవగ్రహ పశుపథహోమాన్ని నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే దంపతులు కూడా హోమంలో కూర్చోన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

▸ వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 6 : గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ఈనెల 9న జరుగనున్న గ్రూప్-1ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 55,692 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయనుండగా, వారి కోసం 93 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఓఎంఆర్ పద్ధతిలో ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని, పది గంటలకు మెయిన్ గేట్లు మూసివేస్తారని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు స్వీకరణ కోసం ఈసారి ప్రత్యేకంగా ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మహిళా పోలీసులు, ఇతర మహిళా సిబ్బందిని సైతం కేంద్రాల వద్ద నియమించడం జరుగుతుందని తెలిపారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రీజినల్ కో-ఆర్డినేటర్, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహేశ్వరంలో మహిళా సంఘాల పనితీరు భేష్

▸ జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణా కేంద్రం మేనేజర్ అభిషేక్

మహేశ్వరం, జూన్ 6 : మహేశ్వరంలో మహిళా సంఘాల పనితీరు బాగుందని, దీని ద్వారా మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణా కేంద్రం (ఎన్ఐఆర్డీ) బృందం మేనేజర్ కితాబిచ్చారు. ఈమేరకు గురువారం మహేశ్వరం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కేంద్రాన్ని ఆయన ఆధ్వర్యంలో ఎన్ఐఆర్డీ బృందం సందర్శించింది. పంజాబ్, జార్ఖండ్, పుదుచ్చేరి, కర్ణాటక, చత్తీస్‌ఘడ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధుల బృందం పాల్గొని మహిళా సంఘాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేనేజర్ అభిషేక్ మాట్లాడుతూ మహిళలు స్వయం సంఘాల ద్వారా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని జీవనోపాధితో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి మహిళా సంఘాల పనితీరును దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రచారం చేసి మహిళలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మహిళా సంఘాలకు ఇక్కడి ప్రభుత్వం కూడా అన్నివిధాలుగా సహకరించడం వంటి ప్రోత్సాహకాలు బాగున్నాయన్నారు. ఇలాంటి సదవకాశాలను మహిళలు వినియోగించుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారెడ్డి, ఏపీఎం సత్యనారాయణ, మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల పనితీరును తెలుసుకుంటున్న ఎన్ఐఆర్డీ ప్రతినిధుల బృందం


బక్కని నర్సింహులును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం

▸ 12న ఊరూరా విజయోత్సవాలు

▸ అధికారమే లక్ష్యంగా పనిచేస్తాం

▸ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 6: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన తెలుగు దేశం పార్టీకి తెలంగాణలో సైతం పూర్వ వైభవం వస్తుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో షాద్‌నగర్‌లో గురువారం టీడీపీ నాయకులు బక్కని నర్సింహులును సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ టీడీపీకి మంచి రోజులు వచ్చాయని, దేశంలోనే అత్యంత సహనం కల్గిన నాయకుడు నారా చంద్రబాబునాయుడని, అలాంటి వ్యక్తికి వచ్చినన్ని కష్టాలు మరెవ్వరికీ రాలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ... విభజన తరువాత ఏపీలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజా సేవయే లక్ష్యంగా రాష్ట్రాల అభివృద్ధి కోసం శ్రమించారని గుర్తుచేశారు. ఒక్క అవకాశం ఇవ్వండని ఏపీలో అధికారంలోకి వచ్చి జగన్ అరాచక పాలనతో టీడీపీ నాయకులతో పాటు ఆ రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని అన్నారు. రాష్ట్రం సైతం అభివృద్ధిలో వెనుకబడి పోయిందన్నారు. అసెంబ్లీలో అనవసరంగా భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు, చంద్రబాబుపై అక్రమ కేసులు.. రిమాండ్‌కు పంపడం, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్ పాలనను భరించలేకపోయారని అన్నారు. చంద్రబాబు వస్తేనే అక్కడి ప్రజలకు భవిష్యత్ ఉంటుందని భావించి కులమతాలకు అతీతంగా తెలుగు దేశం పార్టీ కూటమికి ఓట్లు వేసి, వైసీపీని కూకటి వేళ్ళతో పీకేశారని అన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలే కాదు, తెలుగు ప్రజలందరూ సంతోషపడుతున్నారని తెలిపారు. ఈ నెల 12న 4వ సారి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయబోతున్న సందర్భంగా తెలంగాణలోని ప్రతీ పల్లెలో విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు సైతం తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెడతారని, పార్టీకి పూర్వవైభవం తెచ్చి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి క్యాడర్‌ను సన్నద్ధం చేస్తారని అన్నారు. తానెప్పుడూ పదవులు అడగలేదని, పదవి ఇచ్చినా.. ఇవ్వకపోయినా.. పార్టీ పటిష్టత కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తానని బక్కని నర్సింహులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, ఆన్మారి వెంకటయ్య, గంధం ఆనంద్, కానుగు రాంభూపాల్, అనంతం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి

చేవెళ్ల, జూన్ 6 : మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వృద్ధి చెందాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన తెలిపారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ-2లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సగభాగం ఉన్నా.. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా.. మహిళలకు పూర్తి హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలు అన్నిరంగాల్లో చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఎన్ని చట్టాలు వచ్చినా, ప్రభుత్వాలు మరినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలు అన్యాయానికి గురైతే సీపీఐ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కోచబోని నీలమ్మ, చేవెళ్ల మండల అధ్యక్షురాలు వడ్ల మంజుల, జిల్లా కమిటీ సభ్యురాలు కమల, రమాదేవి, వెంకటమ్మ, సువర్ణ, అంజమ్మ, రేణుక, జయమ్మ, విజయ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరణ చేస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



తాండూరు రూరల్: మల్కాపూర్‌లో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు నాగప్ప



కొడంగల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



శామీర్‌పేట: బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు



పరిగి: మండలం చిట్యాల్‌లో బడిబాటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, జూన్ 6: బడీడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులు నాగప్ప అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు, వీవోలు, డ్వాక్రా సంఘాల మహిళా అధ్యక్షురాలు, ఆయాలతో బడీడు పిల్లలందరూ బడిలో చేర్పించే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగప్ప, ఉపాధ్యాయులు జ్యోతి, శిరీష, జయశ్రీ, భాగ్యశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సహారా బేగం పాల్గొన్నారు.

యాలాల: మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ ఎంపీపీఎస్‌లో జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం అన్ని పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయలు, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి వెంకటయ్య, బుక్ కిపర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని పర్వత్‌పల్లి, బహదూర్‌పూర్ గ్రామాల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక పాఠశాలల్లో తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశమై చర్చించారు. అనంతరం విద్యార్థులు, స్థానికులతో కలిసి గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొడంగల్: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంఈవో రాంరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతను వివరిస్తూ కొడంగల్‌లో ర్యాలీ నిర్వహించారు.

పరిగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో ర్యాలీలు నిర్వహించారు.

దోమ: మండల కేంద్రంలో ఎంపీడీవో జయరాం, ఎంఈవో హరిశ్చంద్ర గురువారంబడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ ప్రమీల, బుక్‌కీపర్ యాదమ్మ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాల (బాలుర) ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, గ్రామస్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాజమ్మ, ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం శ్రీనివాస్, సీసీ వెంకటయ్య ఉపాధ్యాయులు పురుషోత్తం, నర్సింహులు హన్మయ్య, మహేశ్, లక్ష్మణ్, ప్రవీణ్‌కుమార్, చైతన్య, సీఆర్పీ గంగ్యానాయక్ పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని సోమన్‌గుర్తి గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొని బడిబాటను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజిలయ్య, వెంకటేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అరుణాదేవి, పద్మ, ఆశావర్కర్ సైనాజ్‌బేగం, ఉపాధ్యాయులు సంగీత, అశోక్, నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: బడిబాటలో భాగంగా గురువారం తండాలో పూర్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సాయినాథ్, రవి, కృష్ణ, నర్సమ్మ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: కొల్తూర్‌లో జిల్లా అధికారులు ఏఎస్‌పీడీ రమేశ్, జిల్లా విద్యాధికారి విజయకుమారిలు బడిబాట కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేశవరం గ్రామంలోని స్కూల్ యూనిఫామ్ స్టిచింగ్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో వసంతకుమారి, తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శిల్పాయాదగిరి, సెక్టోరియల్ అధికారులు హేమలత, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వీఏవోలు పాల్గొన్నారు.

శామీర్‌పేట: స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద హెచ్‌ఎం వేణు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల అమ్మ ఆదర్శ పాఠ శాల కమిటీ(ఏఏపీసీ) చైర్మన్లు, సభ్యులతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ పాఠశాల్లో హెచ్‌ఎం వారితో బడిబాట నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మహేశ్, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఏపీసీ చైర్‌పర్సన్ మేడి సరిత పాల్గొన్నారు.

మర్పల్లిలో నామమాత్రంగా బడిబాట

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో అధికారులు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మర్పల్లిలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని కొన్ని గ్రామాల్లో నామమాత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రతిజ్ఞ, అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాల్సి ఉండగా మర్పల్లి మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే కార్యక్రమం నిర్వహించడం గమనార్హం.గ్రామాల్లో బడిబాట నిర్వహించని సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రావుల్‌పల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గిరిజనులకు తాగునీటి కష్టాలు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు



బోరు వద్ద నీటి కోసం ఎగబడిన గిరిజన మహిళలు

బషీరాబాద్, జూన్ 6: మండలంలోని మాసన్‌పల్లి పంచాయతీ అనుబంధ గ్రామమైన తౌర్యానాయక్‌తండాలో గిరిజనులు తాగునీటి కష్టాలు పడుతున్నారు. తండాలోని చేతిపంపులు మరమ్మతుకు గురవడంతో నీటి ఇబ్బందులు అధికమయ్యాయి. మిషన్‌భగీరథ నీరొస్తున్నప్పటికీ సరిపోవడంలేదని వారంటున్నారు. చేతి పంపుల మరమ్మతుతో దిక్కుకతోచక గతనెల రోజులుగా సమీప వ్యవసాయ బోర్లను ఆశ్రయించి నీరు తెచ్చుకుంటున్నామని గిరిజన మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదని తండావాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి ఎద్దడిని తీర్చాలని గిరిజనులు వాపోతున్నారు.

పుస్తకాలొచ్చేశాయ్

పరిగి, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వచ్చాయి. పరిగి మండలానికి ఒకటవతరగతి నుంచి 10 వతరగతి వరకు 27,689 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 25,425 పుస్తకాలు వచ్చాయి. అరు నుంచి పదవతరగతి విద్యార్థులకు 33,924 నోటుపుస్తకాలు వచ్చాయి. పరిగి ఎమ్మార్సీ నుంచి మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో హరిశ్చందర్ తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: మండలంతో పాటు పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మొదటి విడతగా 19, 560, రెండవ విడతగా 24, 570 పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేయగా, ఇంకా 7, 714 పాఠ్యపుస్తకాలు రావాల్సిఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి బాలబాలీకలకు రెండు జతల యూనిఫాంలను అందజేయనున్నది. మండల పరిధిలోని 11 గ్రామాల్లో 26 ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలకు ఒక జత స్కూల్ యూనిఫాంలు మాత్రమే వచ్చాయి. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలకు సంబంధించిన 24 పాఠశాలల బాలబాలీకలకు యూనీ ఫాంలు త్వరలో పంపిణి చేయనున్నట్లు అధికారులు చెప్పుతున్నారు. ఘట్‌కేసర్ మండలంతో పాటు పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలలోని 50 పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు వచ్చాయని,ఘట్‌కేసర్ మండలంలోని 11 గ్రామాల్లోని 26 పాఠశాలలకు యూనీఫాంలు రాగా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలోని పాఠశాలలకు ఇంకా రాలేదని మండల విద్యాశాఖ అధికారి శశిధర్ తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

తాండూరు రూరల్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మ ఆదరణ పథకం కింద ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు అయ్యాయని తాండూరు ఎంఈవో వెంకటయ్య అన్నారు. ఎల్మకన్నె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరుగుదొడ్ల పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. అమ్మ ఆదరణ కమిటీ కింద చేపట్టిన పనులు జూన్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దొంగలను పట్టుకుంటే రూ.51వేలు నజరానా

తాండూరు, జూన్ 6: తాండూరు పట్టణం ఆదర్శ నగర్‌లో వెలిసిన శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి నగలను ఎత్తుకెళ్లిన దొంగలను పట్టుకుంటే రూ.51వేల నజరానా అందజేస్తామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారికి వెండి కిరీటం చేయిస్తామని తెలిపారు. కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రతి అమావాస్యకు అల్లంపల్లిప్రకాష్, కుమ్మర నర్సింహులు ఆధ్వర్యంలో 19నెలలుగా అన్నదానం నిర్వహిస్తున్నారు. గురువారం అమావాస్య సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఆలయంలో వెలిసిన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్య సలహాదారులు పాపయ్య, ఉపాధ్యక్షులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

చిన్న నీటి పారుదలకు ప్రాధాన్యత ఇవ్వాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, జూన్ 6: కొడంగల్ నియోజకవర్గంలో చిన్న నీటిపారుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ నర్సింహులులునాయుడు సీఎం రేవంత్‌రెడ్డితో కోరారు. హైదరాబాద్‌లో సీఎంను వారు గురువారం కలిసి మండల సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

రఘువీరా రెడ్డిని అభినందించిన సీఎం

ధారూరు: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరా రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నాగర్‌కర్నూల్ లోకసభ నియోజకవర్గంలో మల్లు రవి గెలుపొందిన సందర్భంగా గురువారం ఆయన హైద్రాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికలలో గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డీనేటర్‌గా పని చేసి మల్లు రవి గెలుపుకు కృషి చేసిన రఘువీరారెడ్డిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, జూన్ 6: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం ఏసీపీ తన కార్యాలయంలో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సమీపిస్తున్నందున ముస్లింలు ఖుర్బానీ కోసం ఉపయోగించే పశువులు నిబంధనలకు విరుద్ధంగా ఉండరాదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, రామన్నగారి శ్రీనివాస్‌గౌడ్ మైసరి రాజు, లవంగ శ్రీకాంత్, సీహెచ్. శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బిల్‌కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సీతక్కకు తమ సమస్యలు వివరిస్తున్న నాగారం బిల్ కలెక్టర్ సవిత

కీసర రూరల్, జూన్ 6: ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న బిల్‌కలెక్టర్లు డిమాండ్ చేసారు. ఈమేరకు గురువారం పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి సీతక్కకు, నగరంలోని సీడీఎంఏ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీకి, సంచాలకులకు తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ వినతి పత్రం అందజేసారు. గత ప్రభుత్వం తమను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించిందని, దీంతో తమ వేతనంలో పెద్ద ఎత్తున కోత పెట్టారని ఆవేదన వ్యక్తం చేసారు. సీఎం దృష్టికి తీసుకెళ్లా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు సవిత, బిక్షపతి, రమేష్, ధర్మారెడ్డి, లక్ష్మన్, సాయికృష్ణ, దుర్గేష్, మహేష్ శ్రీధర్ పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

ఘట్‌కేసర్, జూన్ 6: ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని శివాస్ పంక్షన్‌హాల్‌లో గురువారం ఆయన జన్మదిన సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 38మంది రక్తదానం చేశారు.

మొక్కలు నాటాలి

కులకచర్ల, జూన్ 6: వర్షాలు కురవగానే విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కూలీలకు వసతులు కల్పించాలని తెలిపారు. బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం, ఈసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైలు గేటు దాటొద్దు

వికారాబాద్, జూన్ 6: రైలు గేటు పడిన తరువాత కొందరూ గేటు దాటే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. వికారాబాద్ అనంతగిరి రైల్వే గేటు వద్ద ప్రయాణికులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే గేటు మూసి ఉన్నప్పుడు గేటు బూమ్ కింద నుంచి దూరిపోయే ద్విచక్ర వాహన చోదకులపై చర్యలు ఉంటాయన్నారు.

బాల్య వివాహంపై ఆరా

వికారాబాద్, జూన్ 6: ఈ నెల 2న ధారూరు మండల కేంద్రంలో గల ఒక చర్చిలో కర్ణాటక రాష్ట్రం బీదర్ నగరానికి చెందిన బాలికకు వారి బంధువుల అబ్బాయికి ఇచ్చి వివాహం జరుపుతుండగా పోలీసులు, సంబంధిత అధికారులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనతో బాల్య వివాహంపై సంబంధిత అధికారులను జిల్లా న్యాయాధికారి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను గురువారం వివరణ కోరారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్:** తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్‌లో గతనెల 23న ప్రారంభమైన రేణుకా ఎల్లమ్మ జాతరోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవంతోపాటు సిడే కార్యక్రమం శుక్రవారం(నేడు) నిర్వహించనున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

● **శామీర్‌పేట:** శ్రీభవానిరామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో బుధవారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ భవాణిరామలింగేశ్వర్ స్వామి ఆలయంలో ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. శామీర్‌పేట, తూంకుంటకు చెందిన భజన మండలిబృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

● **కొడంగల్:** పెండింగ్‌లో ఉన్న భూసంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

● **బొంరాస్‌పేట్:** ఎస్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ చేతుల మీదుగా సర్టిఫికేట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం నిర్వాహకుడు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

● **కీసర:** ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఆశావర్కర్ల యూనియన్ సభ్యురాలు జయప్రద గురువారం మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

● **కీసర:** రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మేడ్చల్ ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. కీసరలోని విత్తన, ఎరువుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, మండల వ్యవసాయ అధికారి మాదవీలత పాల్గొన్నారు.

● **ధారూరు:** టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరా రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నాగర్‌కర్నూల్ లోకసభ నియోజకవర్గంలో మల్లు రవి గెలుపొందిన సందర్భంగా గురువారం ఆయన హైద్రాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికలలో గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డీనేటర్‌గా పని చేసి మల్లు రవి గెలుపుకు కృషి చేసిన రఘువీరా రెడ్డిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

తాండూరు రూరల్: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. గుమాస్తానగర్‌కు చెందిన రాకేష్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గౌతాపూర్ సాయిరెడ్డి పటేల్ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా మృతుని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ధారూరు: మండల పరిషత్తు పాలకవర్గం చివరి మండల సర్వసభ్యసమావేశం నేడు (శుక్రవారం) నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఎంపీపీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

● **కులకచర్ల:** మండలంలోని బండవెల్కిచర్లలో కాంగ్రెస్ కార్యకర్త మంత్రి మొగులయ్య (65) బుధవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

క్రైం కార్నర్

మెడికల్ షాపులో కుప్పకూలి యువకుడి మృతి



మృతుడు కుతాడి మురళి(ఫైల్)

కీసర రూరల్,జూన్ 6(ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపులో పనిచేస్తున్న యువకుడు గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందిన సంఘటన గురువారం మేడ్చల్ జిల్లా కీసరలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసరలో నివసించే కుతాడి మురళి(35) నాగారం మున్సిపాలిటీ పరిధి ఆర్ఎల్‌నగర్‌లోని మెడిప్లస్ మెడికల్ షాప్‌లో సేల్స్ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. షాప్‌నకు వచ్చిన కస్టమర్లకు మందులు ఇచ్చి బిల్లింగ్ చేస్తున్నాడు. ఉన్నట్టుండి మురళి ఒక్కసారిగా కుప్పకూలాడు. సహచర ఉద్యోగి అతడిని వెంటనే 108లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. కాగా మురళి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే మురళి అంత్యక్రియలకు కీసర గ్రామస్తులు పెద్దఎత్తున వచ్చి సంతాపం తెలిపారు. మాజీ సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ రూ.10వేలు, మాజీ ఉపసర్పంచ్ రమేష్‌గుప్తా రూ.5వేల చొప్పున మృతుడి కుటుంబానికి అందజేశారు.

విద్యుదాఘాతంతో మహిళ..



ఈశ్వరమ్మ(ఫైల్)

యాలాల, జూన్ 6: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాస్నం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాస్నం గ్రామానికి చెందిన చాకలి ఈశ్వరమ్మ(36) గ్రామంలో ఇస్త్రీ డబ్బాఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తోంది. గురువారం యథావిధిగా తాను ఏర్పాటు చేసుకున్న ఇస్త్రీ డబ్బాలో దుస్తులు ఇస్త్రీ చేస్తుండగా ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే ఇది గమనించిన కుటుంబసభ్యులు, గ్రామస్థులు చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త వెంకటయ్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..

కొడంగల్ రూరల్, జూన్ 6: మండలంలోని ఇందనూర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన కల్వర్టు దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు.పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వృద్ధురాలు(60) మృతదేహం రోడ్డుపై గాయలతోపడి ఉండగా అట్టి మృతదేహాన్ని గమనించి కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు 8712670046, 8712583263 సెల్‌నెంబర్‌లకు సమాచారం అందించాలని కోరారు.

మనస్తాపానికి గురై మహిళ బలవన్మరణం

కీసర రూరల్, జూన్ 6: ఒంటరి తనం భరించలేక మనస్తాపానికి గురై ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాల ప్రకారం.. భూపాల్ జిల్లాకు చెందిన గుండేటి హిరణ్య(32)కు ఇద్దరు కూతుళ్లు సహస్ర, సంయుక్త ఉన్నారు. వారిలో ఒకరు కీసర, మరొకరు ఘట్‌కేసర్‌లోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కాగా హిరణ్య నాలుగు నెలల నుంచి తన భర్తకు దూరంగా ఉంటోంది. తన పిల్లల చదువు నిమిత్తం ఆమె కీసర గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఉన్నట్టుండి ఆమె బుధవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చుట్టుపక్కల వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

120క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం డీసీఎం

పరిగి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం గురువారం వికారాబాద్ జిల్లా పరిగిలో పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం(కేఏ33 ఏ8756)లో 120క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలతో కొందర్గు నుంచి పరిగి మీదుగా కొడంగల్ వెళ్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కొడంగల్ చౌరస్తా వద్ద వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నారు. బియ్యం డీసీఎంను స్టేషన్‌కు తరలించారు. పోలీసులు బియ్యం పట్టుకున్న సమాచారాన్ని రెవెన్యూ, సివిల్‌సప్లయిస్ శాఖ అధికారులు సమాచారమిచ్చారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మెకానిక్ షెడ్‌లో అగ్నిప్రమాదం.. 18 బైక్‌లు దగ్ధం



తగలబడుతున్న బైక్ మెకానిక్ షెడ్

మేడ్చల్ టౌన్, జూన్ 6 : మెకానిక్ షెడ్‌లో అగ్ని ప్రమాదం సంభవించగా 18బైక్‌లు దగ్ధమయ్యాయి. బైక్‌మెకానిక్ షెడ్ నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణంలోని వివేకానంద చౌరస్తా పాత జాతీయ రహదారి సమీపంలోని అర్జున్ చౌహాన్ బైక్ పాయింట్‌లో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించటంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అనంతరం అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని షెడ్‌లోని మంటలను చల్లార్చారు. కాగా ఈ ప్రమాదంలో షెడ్‌లో ఉన్న 18పాత బైకులు దగ్ధమైనట్లు షెడ్ నిర్వాహకులు లిపారు.

జింకను పీక్కుతిన్న వీధి కుక్కలు



అనంతగిరిలో జింకను పిక్కతింటున్న వీధి కుక్కలు

వికారాబాద్, జూన్ 6: అనంతగిరిలో వీధి కుక్కలు జింకను వేటాడి తినేశాయి. ఆలయ పుష్కరిణి సమీపంలో గురువారం ఉదయం వీధి కుక్కలు జింకను వెంటాడి చంపి పీక్కుతినడం కలకలం రేపింది. అనంతగిరిలో వీధి కుక్కలు పదుల సంఖ్యలో ఉండగా ఈకుక్కలు రోజూ ఉదయం అడవిలో తిరుగుతూ కనిపించిన మూగజీవాలను వేటాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆటవీ శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్లాట్ కబ్జా.. తండ్రీ కొడుకులపై కేసు



బైరు రాములుగౌడ్, అతడి కుమారుడు విఘ్నేష్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 6: ప్లాట్ కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడిన చౌదరిగూడ మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్, అతడి కొడుకు బైరు విఘ్నేష్‌గౌడ్‌లపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని బేగంపేట్‌కు చెందిన వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించే మల్లారెడ్డి 2005లో ఘట్‌కేసర్ మండలం, చౌదరిగూడ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 261 పార్టులో 756 ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. మల్లారెడ్డి తన ప్లాట్ చుట్టూ ప్రహరీ నిర్మించుకొని అందులో బోరు వేశాడు. అయితే అదేగ్రామ మాజీసర్పంచ్ బైరు రాములుగౌడ్ అతడి కుమారుడు బైరు విఘ్నేష్‌గౌడ్‌లు ప్లాట్‌ను కబ్జాచేసి ప్రహరీ, బోరును ధ్వంసం చేశారు. ఇదేమని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడారని, దీంతో మల్లారెడ్డి ప్లాట్ కబ్జా విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు ప్లాట్ కబ్జాచేసి బైరు రాములుగౌడ్, అతడి కుమారుడు బైరు విఘ్నేష్‌గౌడ్‌లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పోచారం ఐటీసీ పోలీసులను ఆదేశించారు. విచారణ చేపట్టిన పోలీసులు బైరు రాములుగౌడ్, అతడి కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.